అన్ని రంగాల్లో మహిళలు ముందంజ

- క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి
- సమాజంలో మహిళల్ని గౌరవిస్తేనే.. దేశం ఆర్థిక పరిపుష్టి చెందుతుంది..
- చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం
- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో నారీమణులు

మైసమ్మగూడలోని సెయింట్‌పీటర్స్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో అమెరికా హాస్పిన్ క్యాన్సర్ హౌస్ మెడికల్ డైరెక్టర్, అంకాలజిస్ట్ డాక్టర్ రోహిణి, తదితరులు

మేడ్చల్, మార్చి 7 : నేటి సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని అమెరికా హాస్పిన్ క్యాన్సర్ హౌస్ మెడికల్ డైరెక్టర్, అంకాలజిస్ట్ డాక్టర్ రోహిణి అన్నారు. గురువారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళ తల్లిగా, భార్యగా, గృహణిగా బహు పాత్రలు పోషిస్తూ విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అమ్మాయి పుడితే భారంగా భావించే రోజులు పోయి మేలు అనుకునే రోజులు వచ్చాయన్నారు. క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. సర్వైకల్ క్యాన్సర్ రాకుండా వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ.. మహిళలు విద్య, వైద్యం, న్యాయం, పోలీసు రంగాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డాక్టర్ సరిత, హర్షారెడ్డి, డాక్టర్ సంధ్య, పీఆర్‌వో రవి సుధాకర్ పాల్గొన్నారు.

మహిళా కండక్టర్లకు సన్మానం

మేడ్చల్ ఆర్టీసీ డిపోలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన మహిళా కండక్టర్లు కవిత, సైదమ్మ, సుమంగళను సన్మానించారు. అలాగే మహిళా ఉద్యోగులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ మేనేజర్ రామారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కీలక పాత్ర పోషించాలి..

రామంతాపూర్, మార్చి 7 : సమాజాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషించాలి కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు అన్నారు. గురువారం ఇందిరానగర్‌లోని ప్రతిభ స్కూల్లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, గాదె సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం

ఘట్‌కేసర్, మార్చి 7 : ఈనెల 8న మహిళా దినోత్సవాన్ని పునస్కరించుకొని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి గురువారం తన కార్యాలయంలో మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఎండీఓ గీతారెడ్డితోపాటు,కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగులందరికి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, కొర్రెముల కార్యదర్శి కవిత, సబిత, సత్యవతి, అర్పిత, అంజలి, లక్ష్మమ్మ, రాములమ్మ, కుమార్, దినేశ్, కుమార్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి..

శామీర్‌పేట, మార్చి 7 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ ఎల్లూభాయి, జడ్పీటీసీ అనితలాలయ్య అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మమతాభాయి, వైస్ ఎంపీపీ సుజాత, ఎంఈవో వసంతకుమారి, ఎంపీటీసీ ఇందిరా, డిప్యూటీ తాసీల్దార్ ప్రసన్నలక్ష్మి, ఆర్ఐ సుమల, టైపిస్ట్ దేవి, రాజమణి, దుర్గా పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాటాలు చేద్దాం

జవహర్‌నగర్, మార్చి 7: సమాజంలో మహిళల్ని గౌరవిస్తేనే... దేశం ఆర్థిక పరిపుష్టి చెందుతుందని, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, మహిళల హక్కుల కో సం పోరాటాలు ఉధృతం చేయాలని మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లా సమాఖ్య కార్యదర్శి లక్ష్మి అన్నారు. గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని గిరిప్రసాద్‌నగర్ కాలనీలో రాజేశ్వరి ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య సమక్షంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంతోషియాదవ్, పద్మయాదవ్, శ్యామల లత, స్వరూప, పద్మమ్మ, జయ, లక్ష్మి, కవిత, నర్సమ్మ, లక్ష్మి, మల్లిక, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, లక్ష్మణ్, సహదేవ్, జంగయ్యయాదవ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

బధిరుల కళాశాలలో ..

నేరేడ్‌మెట్, మార్చి 7: నేరేడ్‌మెట్ డివిజన్, శ్రీకాలనీలోని హెలెన్ కెలర్స్ కళాశాల, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హైటెక్ సిటీ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా లయన్ ఉమ్మర్ ఖాన్ సతీమణి రామేజాబి మహిళలకు సత్కరించారు. ఈకార్యక్రమంలో హెలెన్ కెలర్స్ చైర్మన్ ఉమ్మర్ ఖాన్, అర్మగం, మధుకుమార్, అంజయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న కీసర బ్రహ్మోత్సవాలు

కీసర, మార్చి 7: కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజు గురువారం శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామివారికి బిల్వార్చన, రుద్రస్వాహాకార హో మం, ప్రదోషకాలపూజ, హారతి, మంత్రపుష్పం, తదితర పూజలు నిర్వహించారు . పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వా మివారిని దర్శించుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున రావడంతో కీసరగుట్ట కిటకిటలాడిం ది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు నేరుగా యాగశాలలోకి వెళ్లి హోమాలను దర్శించుకున్నారు. అలాగే.. ఆర్యవైశ్య నిత్యాన్నదానసత్రం ఆధ్వర్యంలో, మున్నూరుకాపు సంఘం, రాష్ట్ర వంశిరాజ్ సంఘం ఆ ధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం యాగశాలలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు గణపతిశర్మ

రూ.22.29 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

మేడ్చల్, మార్చి 7 : మేడ్చల్ మున్సిపాలిటీకి వచ్చే ఆర్థిక సంవత్సర వార్షిక బడ్జెట్‌ను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. చైర్‌పర్సన్ మర్రి దీపికా నర్సింహారెడ్డి అధ్యక్షతన గురువారం మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం మున్సిపాలిటీ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం రూ.2255.90 లక్షలు కాగా వ్యయం 2228.90 లక్షలుగా అంచనా వేశారు. వైస్‌చైర్మన్ రమేశ్, కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం తాగవద్దన్నందుకు..భర్త ఆత్మహత్య

జవహర్‌నగర్, మార్చి 7: మద్యం తాగడంమానేస్తేనే ఇంటికి వస్తానని చెప్పి అమ్మమ్మ ఇంటికి వెళ్లిన భార్య...అప్పటికే మద్యం మత్తులో ఉన్న భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ కథనం ప్రకారం... జవహర్‌నగర్ కార్పొరేషన్ బాలాజీనగర్ చంద్రపురికాలనీలో సింహాద్రి నాగరాజు, భార్య, కుమార్తెతో కలిసి నివాస ముంటున్నాడు. నాగరాజుకు గతంలోనే పెండ్లికాగా ఆమెతో విడాకులు తీసుకుని... కళ్యాణిని రెండో పెండ్లి చేసుకున్నాడు. నాగరాజు(36) మద్యం తాగుతూ భార్యను వేధింపులకు గురి చేసేవాడు.ఈ క్రమంలో ఈ నెల 6న మద్యం సేవించి నాగరాజు ఇంటికి వచ్చాడు... విసుగు చెందిన కళ్యాణి మద్యం సేవించడం మానేస్తేనే ఇంటికి వస్తానని చెప్పి దమ్మాయిగూడలోని అమ్మమ్మ ఇంటికి పిల్లలతో సహా వెళ్లింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న నాగరాజు సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం కళ్యాణి వచ్చి చూడగా ఉరివేసుకుని కన్పించాడు. కళ్యాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

9న సీఎం సభను విజయవంతం చేయాలి

మేడ్చల్ రూరల్, మార్చి 7: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 44వ జాతీయ రహదారి పక్కన ఈ నెల 9న సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ కోరారు. గుండ్లపోచంపల్లిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. కండ్లకోయలోని ఐటీ పార్క్ స్థలంలో డ్వాక్రా మహిళలతో ముందుగా సమావేశమైన అనంతరం గుండ్లపోచంపల్లిలో సాయంత్రం 5 గంటలకు సభ నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

– గుండ్లపోచంపల్లిలో నిర్వహించే సీఎం సభ ప్రాంగణాన్ని సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ పరిశీలించారు. ఏర్పాట్లను క్షుణ్ణంగా సమీక్షించి, సభ స్థలిలో స్టేజ్ ఏర్పాటు, పార్కింగ్ స్థల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. డీసీపీ లితికా పంత్, మేడ్చల్ సీఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న రెవెన్యూ అధికారులు ..

కాప్రా, మార్చి 7: కాప్రాడివిజన్ మహ్మదీయకాలనీ వెనుక వైపు సర్వే నంబర్ 510లోని ఖాళీ ప్రభుత్వస్థలంలో కొంతమంది అక్రమంగా నిర్మాణం చేపడుతుండగా.. కాప్రా మండలం రెవెన్యూ అధికారులు గురువారం అడ్డుకున్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదుతో రెవెన్యూ యంత్రాంగం జేసీబీతో సంఘటనా స్థలా నికి వెళ్లి అక్రమ నిర్మాణాన్ని ఆపారు. ప్రభుత్వస్థలంలో ఎలాంటి నిర్మాణం చేపట్టినా కూల్చివేస్తామని తాసీల్దార్ సుచరిత , రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి హెచ్చరించారు.

అన్ని రంగాల్లో నాగారం మున్సిపాలిటీ అభివృద్ధి

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 7 : అన్ని రంగాల్లో మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని నాగారం మున్సిపాలిటీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ సాధారణ సమావేశం చైర్మన్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశలవారీగా మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. రోడ్లు, డ్రైనేజీ, నీరు, తదితర సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ముంపు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేశామని తెలిపారు. ఈ సమావేశంలో నాగారం, రాంపల్లి నాలా శుభ్రం చేయడానికి పట్టణ ప్రగతి నిధులు రూ.10 లక్షలు, రాంపల్లి హిందూ గ్రేవ్‌యార్డు బ్యాలెన్స్ పనులకు రూ.15 లక్షలు, వీధి దీపాల నిర్వహణ, విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు రూ.1.98 కోట్లు వెచ్చించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేశ్ యాదవ్, కమిషనర్ రాజేంద్ర కుమార్, మేనేజర్ చంద్రశేఖర్, డిప్యూటీ ఇంజినీర్ రఘు, సుదర్శనం, వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

మల్కాజిగిరి, మార్చి 7: ఓల్డ్ అల్వాల్ చంద్రపురి కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న మెకానిక్ షెడ్‌ను తొలగించాలని కాలనీ అధ్యక్షుడు దేవేందర్ గురువారం అల్వాల్ సర్కిల్ డీసీకి వినతి పత్రం అందజేశారు. ప్రశాంతంగా ఉన్న కాలనీలో వాణిజ్యపరమైన షాపుల నిర్మాణాలను ఎట్టిపరిస్థితుల్లో అనుమతించమని అన్నారు.

రూ.40లక్షలతో పార్కు అభివృద్ధి

బోడుప్పల్, మార్చి7: బోడుప్పల్ నగరపాలక సంస్థ మేడ్చల్ నియోజకవర్గంలోనే ఆదర్శంగా నిలుస్తుందని మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. రూ.40లక్షల నిధులతో అభివృద్ధి చేసిన లక్ష్మీనగర్ హుడాపార్కును కమిషనర్ రామలింగం, కార్పొరేటర్ లతారామచంద్రారెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. నగరవ్యాప్తంగా ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పాలకవర్గం కృషిచేస్తుందని అన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, కార్పొరేటర్లు చీరాల నర్సింహా, వెంకటేశ్‌గౌడ్,మహేశ్వరి, నాయకులు రాంచంద్రారెడ్డి, అమరలింగారెడ్డి, కాలనీప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవోగా గ్యామ

శామీర్‌పేట, మార్చి 7 : మూడుచింతలపల్లి మండల అభివృద్ధి ఇన్‌చార్జి అధికారి(ఎంపీడీవో)గా గ్యామ గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం పని చేస్తున్న వత్సలాదేవి మార్చి 3 నుంచి 31 వరకు సిక్ లీవ్‌లో ఉండటంతో ఆ స్థానంలో కీసర ఎంపీడీవోగా పని చేస్తున్న గ్యామకు మూడుచింతలపల్లి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

మొగి పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి

శామీర్‌పేట, మార్చి 7 : మొగి పురుగు నివారణ చర్యలు చేపట్టాలని రైతు శిక్షణ కేంద్రం రాజేంద్రనగర్ వ్యవసాయ అధికారి మాధవిలత అన్నారు. శామీర్‌పేట మండలం, అలియాబాద్ గ్రామంలో గురువారం రైతు శిక్షణ కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరి పంటలో మొగి పురుగు వ్యాప్తి, జింక్ లోపాన్ని గుర్తించినట్లు తెలిపారు. నివారణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని కోరారు. మొగిపురుగు నివారణకు క్లోరంత నిలప్రోల్ గుళికలు నాలుగు కిలోలు లేదా కార్బోప్ హైడ్రోక్లోరోఫైడ్ గుళికలు 8 కేజీలు వాడుకోవాలన్నారు. జింక్ లోపాన్ని నివారించేందుకు జింక్ చిలామిన్ 500 గ్రాములు ఎకరాకు వేసుకోవాలన్నారు.

ఉపాధిలో ఉచిత శిక్షణ

ఘట్‌కేసర్,మార్చి7: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులకు సత్యసాయి శిక్షణ కేంద్రం ఉచిత శిక్షణ అందిస్తుందని ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ముల్లి పావనీ జంగయ్య యాదవ్ తెలిపారు. ఎలాంటి రుసుము లేకుండా బ్యాంకింగ్, ఫైనాన్స్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లలో శిక్షణ ఇస్తున్నారని, మున్సిపాలిటీ పరిధి, 6వార్డులోని మహిళా మండలి భవనంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

కాలనీల సమగ్రాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బండారి

చర్లపల్లి, మార్చి 7 : మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని కాలనీల సమగ్రాభివృద్ధికి కృషి చేయనున్నట్లు మ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని అణుపురం కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్రాజెక్ట్‌ను స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సమస్యలను దశలవారీగా పరిష్కరించి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వాసుదేవ్, రామకృష్ణారావు, సభ్యులు డాక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆనంద్‌నాయుడు, రామ్మోహన్‌రాయ్, బాలరామ్మూర్తి పాల్గొన్నారు.

అణుపురం కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శిరీషాసోమశేఖర్‌రెడ్డి